

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, ఎంపీ రవిచంద్ర, నేతలు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, లింగయ్య యాదవ్

సీఎం బామ్మర్దికి అమృతం!

మొదటిపేజీ తరువాయి...

అనుకోవాల్సి ఉంటుందన్నారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు సైతం రేవంత్‌రెడ్డిని పొగడటం ఆశ్చర్యానికి గురిచేస్తున్నదని అన్నారు. రేవంత్ తన కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం కలిగేలా వ్యవహరిస్తూ అనేక కుంభకోణాలకు పాల్పడుతున్నారని, త్వరలోనే వరుసగా వాటిని బయటపెడతానని చెప్పారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి సకుటుంబ సపరివార అవినీతి కుటుంబ కథా చిత్రం నడుస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే భారీ కుంభకోణానికి రేవంత్ పాల్పడ్డారని ధ్వజమెత్తారు. తెలంగాణలోని వివిధ పట్టణాల్లోని మంచినీటి సరఫరా కోసం అమృత్ పథకం కింద టెండర్లు పిలిచారని, సీఎంగా, మున్సిపల్ వ్యవహారాలశాఖ కూడా చూస్తున్న రేవంత్‌రెడ్డి ఈ కుంభకోణం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తన బావమరిదికి అమృత్ టెండర్లు ఇస్తే.. ప్రజలకు మాత్రం విషం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమృత్ టెండర్లలో సీఎం కుటుంబ సభ్యులు భారీ అవినీతికి పాల్పడినట్టు తమ వద్ద ఆధారాలున్నాయని తెలిపారు. దీనిపై కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు లేఖ రాసినట్టు తెలిపారు.

పేరొకరిది.. పనులు మరొకరికి

సీఎం బావమరిది సూదిని సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్స్‌కు అర్హతలు లేకున్నా వేలకోట్ల రూపాయల పనులు కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక వనరులు కానీ, ఆర్థిక పరపతి కానీ, సంపత్తి కానీ దానికి లేవని తెలిపారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకొని, ఇండియన్ హ్యూమ్ పైప్ (ఐహెచ్‌పీ) అనే కంపెనీని పిలిపించి, బెదిరించి ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని ఆరోపించారు. పేరుకే ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ అయినా రేవంత్‌రెడ్డి బావమరిది కోసం ఈ టెండర్లను కట్టబెట్టారని పేర్కొన్నారు. అందులో భాగంగానే జాయింట్ వెంచర్ పేరుతో డ్రామాకి తెరలేపారని ఆరోపించారు. రూ.1137 కోట్ల కాంట్రాక్టు దక్కిందని చెప్పూ ఎన్ఎస్ఈ, బీఎస్ఈకి ఐహెచ్‌పీ లేఖ రాసిందని వివరించారు. 20 శాతం పనిని తాము చేస్తున్నామని, ముఖ్యమంత్రి బావమరిది కంపెనీ మాత్రం 80 శాతం అంటే దాదాపు వెయ్యి కోట్ల పనిచేస్తుందని లేఖలో పేర్కొన్నారని తెలిపారు. కంపెనీని శిఖండి సంస్థగా అడ్డంపెట్టుకుని రేవంత్‌రెడ్డి, సృజన్‌రెడ్డి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని విమర్శించారు. రూ. 2 కోట్ల సృజన్‌రెడ్డి కంపెనీ రూ. 1000 కోట్ల పనులు, పబ్లిక్ లిస్టెడ్ కంపెనీ అయిన ఐహెచ్‌పీ రూ. 200 కోట్ల పనులు చేయడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి పదవి పోతది

ఆఫీస్ ఫర్ ప్రాఫిట్ చట్టం, అవినీతి నిరోధక చట్టం 1988 లో సెక్షన్ 7, 11, 13 నిబంధనల ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆయన సీఎం పదవి కొల్పోతారని కేటీఆర్ తెలిపారు. తన కుటుంబ సభ్యులకు లబ్ధిచేకూరిస్తే, ఆశ్రిత పక్షపాతం చూపిస్తే ఈ చట్టం ప్రకారం శిక్షార్హులని తెలిపారు. గతంలో ఇవే చట్టాల కింద సోనియాగాంధీ 2006లో నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్‌పర్సన్ పదవిని కోల్పోయారని గుర్తుచేశారు. అక్రమ మైనింగ్ అనుమతుల నేపథ్యంలో కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప, ఆదర్శ్ కుంభకోణంలో 2011లో మహారాష్ట్ర అప్పటి ముఖ్యమంత్రి అశోక్ చవాన్ పదవి కోల్పోయారని గుర్తుచేశారు. బావమరిది కండ్లలో సంతోషం కోసం రేవంత్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని పేర్కొన్నారు. తన ఇంట్లో లంకెబిందెలు నింపుకోవడం కోసమే అక్రమ టెండర్లకు తెరలేపారని ఆరోపించారు. అమృత్ టెండర్ల వివరాలను ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

మరిన్ని కుంభకోణాలు

రేవంత్‌రెడ్డి కుంభకోణాలను ఒక్కొక్కటిగా ప్రజల ముందు ఉంచుతానని కేటీఆర్ తెలిపారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఫోర్త్ సిటీ కుంభకోణాలను బయటపెడతానని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తొలుత దీనిపై మాట్లాడారని, ఆ తర్వాత కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో దీనిపై మాట్లాడడం మానేశారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్-బీజేపీ మధ్య ప్రేమకథ నడుస్తున్నదని ఆరోపించారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రాజాసింగ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రధానమంత్రి ఆర్ఆర్ ట్యాక్స్ గురించి మాట్లాడినా, ఇక్కడ మాత్రం చర్యలు ఉండవని పేర్కొన్నారు. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం అనుకుంటే రేవంత్‌రెడ్డి పదవి ఉండదని కేటీఆర్ తేల్చి చెప్పారు.

బీజేపీ- కాంగ్రెస్ కుమ్మక్కు కాకుంటే

కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మంత్రులుగా ఉన్నారని, రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు ఉన్నారని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు కాకుంటే టెండర్ల ప్రక్రియపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో వారు మౌనంగా ఉన్నా, విచారణకు ఆదేశించకున్నా రేవంత్‌రెడ్డికి, వారికి మధ్య పూర్తిస్థాయి అవగాహన ఉన్నట్టుగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు.

లోకం పోకడ



మన మార్కు పేర్ల మార్పులో భాగంగా దీన్ని ఇలా మార్చేశాను సార్!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.7°c	23.0°c
మెదక్	36.8°c	20.5°c
మహబూబ్‌నగర్	32.0°c	21.0°c
వరంగల్	32.0°c	24.0°c
ఖమ్మం	32.0°c	24.0°c
కరీంనగర్	31.0°c	25.0°c
రంగారెడ్డి	30.0°c	20.1°c
హైదరాబాద్	30.0°c	22.3°c
నల్లగొండ	28.5°c	23.0°c
నిజామాబాద్	27.3°c	23.5°c

రేపటి నుంచి భారీ వర్షాలు

జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో నెలకొన్న ఆవర్తనం ప్రభావంతో దక్షిణ తెలంగాణ జిల్లాలతోపాటు దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో 23న ఏర్పడే అల్పపీడన ప్రభావం వల్ల ఈ నెల 23 నుంచి 26 వరకు దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తా, కర్నూలు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ శనివారం హెచ్చరికలు జారీ చేసింది. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, జనగామ, భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్టు తెలిపింది. మరోవైపు శనివారం రాత్రి నగరంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు రాకపోకలకు చాలా ఇబ్బంది పడ్డారు.

సీఎం సాక్షిగా ఎంపీ మల్లు రవికి అవమానం

వెనుక సీటులో కూర్చున్నా లేపేసిన సెక్యూరిటీ

సీఎం వెనుక దళిత ఎంపీ కూర్చోవద్దా: బాల్క

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత ఎంపీ మల్లు రవికి అవమానం ఎదురైంది. సీపీఎం నేత సీతారాం ఏచూరి సంస్మరణ సభకు హాజరైన మల్లు రవి వేదికపై రెండో లైన్‌లో కూర్చున్నారు. మొదటి వరుసలో సీపీఎం జాతీయ నేతలు, సభాధ్యక్షుడు, ముఖ్య అతిథి సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. సభకు ముందుగానే వచ్చిన మల్లు రవి సీఎం రేవంత్‌రెడ్డి కోసం ఏర్పాటుచేసిన కుర్చీకి సరిగ్గా వెనుక వరుస సీటులో కూర్చున్నారు. ఇంతలో సీఎం రేవంత్ సభావేదిక వద్దకు వచ్చారు. ఆయనకన్నా ముందుగా వేదిక నెక్కిన సెక్యూరిటీ సిబ్బంది వెనుకసీటులో కూర్చున్న మల్లు రవిని లేవాలని ఆదేశించారు. తానెందుకు లేవాలి అని మల్లు రవి నిలదీసినప్పటికీ బలవంతంగా ఆయనను అక్కడి లేపి మరింత వెనుకకు పంపించారు. దీంతో దళిత ఎంపీకి జరిగిన అవమానంపై దళితవర్గాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

ఖండించిన బాల్కసుమన్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి దళిత ప్రజాప్రతినిధులను అవమానిస్తూనే ఉన్నదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏచూరి సంస్మరణ సభలో దళిత ఎంపీ మల్లు రవిని సీఎం రేవంత్‌రెడ్డి సెక్యూరిటీ సిబ్బంది బలవంతంగా లేపి అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఒక సిట్టింగ్ దళిత ఎంపీ అయిన మల్లు రవి సీఎం వెనకాల రెండో వరుసలో కూడా కూర్చోడానికి అర్హుడు కాదా? అని నిలదీశారు. ఇందుకు సంబంధించిన వీడియోను శనివారం ఎక్స్‌లో పోస్టుచేసి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

30 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు వివిధ కారణాలతో మృతిచెందగా, బాధిత కుటుంబాలకు తెలంగాణభవన్‌లో పార్టీ తరపున శనివారం ఒక్కొక్కరికీ రెండు లక్షల ప్రమాద బీమా ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్, మాజీ ఎంపీ రాపోల చంద్రశేఖర్‌రెడ్డి

బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ టూర్

- తమిళనాడు, కేరళలో అధ్యయనం
- స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు ఇవ్వాలి
- లేదంటే ప్రత్యక్ష కార్యాచరణ నిర్ణయిస్తాం
- బీఆర్ఎస్ బీసీ నేతల నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు, కులగణనపై అధ్యయనం చేసేందుకు తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పర్యటించాలని బీఆర్ఎస్ బీసీ ముఖ్యనేతలు నిర్ణయించారు. బీసీల కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశాలపై ఆయా రాష్ట్రాల్లో అధ్యయనం చేయనున్నారు. శాసనమండలి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో శనివారం తెలంగాణ భవన్‌లో బీసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన సమావేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న మెరుగైన విధానాలను అధ్యయనం చేయాలని కేటీఆర్ సూచించారు. ఈ నేపథ్యంలో తమిళనాడు, కేరళలో అమలు చేస్తున్న రిజర్వేషన్లు, తమిళనాడు ప్రభుత్వ చిత్తశుద్ధి వల్ల బీసీలకు దక్కిన రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలపై అధ్యయనం చేసి నివేదికను ప్రభుత్వానికి, పార్టీకి అందించాలని నిర్ణయించారు. నవంబర్ 10లోగా కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కులగణన చేసి, 42 శాతం రిజర్వేషన్ల కల్పన, బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించక పోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని నిర్ణయించారు. సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, జాజాల సురేందర్, నోముల భగత్, దాసోజు శ్రవణ్ కుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్ గౌడ్, జూలూరి గౌరీ శంకర్, డాక్టర్ ఆంజనేయ గౌడ్, చిరుమల్ల రాజేశ్ కుమార్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిశోర్‌గౌడ్, ఉపేంద్రాచారి, బీఆర్ఎస్ నాయకులు గట్టు రాంచందర్‌రావు, గోసుల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణభవన్‌లో బీసీ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, చిత్రంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నేతలు

కేటీఆర్ ఆరోపణలు అసత్యం.. నిరూపిస్తే రాజీనామా

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): అమృత్ పథకంలో సీఎం రేవంత్‌రెడ్డి అవినీతికి పాల్పడినట్టు కేటీఆర్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమృత్ పథకం కింద రూ. 8,888 కోట్ల అవినీతి జరిగిందని బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లపై తాను ఏ కంపెనీని బెదిరించలేదని స్పష్టం చేశారు. తాను రాజకీయాలకు రాక ముందే కాంట్రాక్టర్‌నని, ఎవరికీ భయపడబోనని పేర్కొన్నారు. ఆరోపణలను కేటీఆర్ నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు.

జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్ట్

- పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లిన మాజీ మంత్రి ఎర్రబెల్లి
- సమస్య పరిష్కరిస్తామని సీపీ హామీతో ఆందోళన విరమణ

జనగామ, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండలానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ నాయకులను శనివారం పోలీసులు అరెస్టు చేయడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. దేవరుప్పుల మండలం చిన్నమడూరు గ్రామంలో ధృవ వెంచర్ వ్యవహారంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య జరిగిన గొడవలో స్థానిక కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకొని ప్రత్యర్థులను బెదిరించి కిడ్నాప్ చేశారు. దీన్ని ఎత్తిచూపిన స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఇద్దరిపై కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లారు. దీంతో ఎర్రబెల్లికి ఏసీపీ నర్సయ్య నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కిడ్నాప్ చేసిన కాంగ్రెస్ నాయకులను వదిలిపెట్టి బీఆర్ఎస్ నాయకులను ఎలా అరెస్ట్ చేస్తారని ఎర్రబెల్లి పోలీసులను నిలదీశారు. బాధితుడు పోస్టు ద్వారా ఆధారాలు పంపినా ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నించారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో ఎర్రబెల్లిని ఫోన్‌లో మాట్లాడించారు. కిడ్నాప్‌కు గురైన వ్యక్తి పిటిషన్‌పై సోమవారం లోగా కేసు నమోదు చేస్తామని డీసీపీ హామీ ఇవ్వడం, ఆ వెంటనే వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝా సైతం దయాకర్‌రావుకు ఫోన్‌చేసి సమస్య పరిష్కరిస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ పేరిట రాసిన ఫిర్యాదును ఎర్రబెల్లి సమక్షంలో పార్టీ శ్రేణులు ఎస్సై సృజన్ కుమార్‌కు అందజేశారు.

నిబద్ధతగల నేత సీతారాం ఏచూరి

- కడదాకా కమ్యూనిస్టుగా బతికిన నేత
- నేటితరం నేతలకు స్ఫూర్తిదాయకుడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 21: పదవుల చుట్టూ పరిభ్రమించే ఈనాటి రాజకీయ నేతల్లో స్థిరంగా సిద్ధాంతం కోసం నిలిచిన నిబద్ధత గల ఆదర్శ నాయకుడు సీతారాంఏచూరి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. ఎవరు ఏ సమయంలో ఏ పార్టీ కండువా మారుస్తారో తెలియని ఫిరాయింపుల కాలంలో కడదాకా కమ్యూనిస్టుగా బతికిన నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. నేటి తరం రాజకీయ నాయకులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఢిల్లీలో వెలిగిన అసలైన హైదరాబాద్ బిడ్డ ఏచూరి అంటూ నివాళులర్పించారు. ఇటీవల ఢిల్లీలో కన్నుమూసిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ.. ఏచూరి హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ స్కూల్ చదువుకున్నారని, ఆ పాఠశాల పక్కనే ఉన్న గ్రామర్ స్కూల్‌లో చదివానని తెలిపారు. తామిద్దరం నిజాం కాలేజీలోనే డిగ్రీ పూర్తి చేశామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ.. ఓట్ల రాజకీయాల్లో వెనుక బడ్డాం.. ప్రజల కోసం చేసిన పోరాటాలలో ముందున్నామని ఏచూరి అనేవారని గుర్తుచేశారు. విద్యావంతుల కుటుంబంలో పుట్టిన ఏచూరి ప్రశ్నించే గొంతుకగా ఎదగడం చాలా గొప్ప విషయమని అన్నారు. పోరాటాల నుంచే వచ్చే నాయకునికి ప్రజల కష్టాలు, సుఖ దుఃఖాలు తెలుసునని చెప్పారు. తిట్లు, రోత మాటలే రాజకీయంగా చలామణి అవుతున్న ఈ రోజుల్లో ఏచూరి ఎంతో హుందాగా వ్యవహరించేవారని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో జేఎన్‌యూ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీని ఆమె ఎదుటే నిలిచి రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన గుండెధైర్యం గల నాయకుడు ఏచూరి అని కొనియాడారు. సిద్ధాంతపరంగా తమ పార్టీలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సీపీఎం వ్యతిరేకించినా.. పోరాటాలపరంగా తమ రెండు పార్టీల రక్తం ఒక్కటేనని వ్యాఖ్యానించారు.

నీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముఠా గోపాల్, పార్టీనేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్, సీపీఎం నేతలు

ఏచూరి మృతి దేశానికి తీరని లోటు: సీఎం

ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని రగిలించి.. పేద ప్రజల పక్షాన గళం విప్పిన సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటని అన్నారు. ప్రజాస్వామిక వేదికలపై మన కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్పనాయకుడని కొనియాడారు. దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డికి సమకాలికుడుగా ఉండేవారని అన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో పేదలకు ఉపయోగపడే కీలక బిల్లుల ఆమోదం విషయంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. ఏచూరిని రాహుల్‌గాంధీ మార్గానిర్దేశకుడిగా భావిస్తారని చెప్పారు. దేశంలో జమిలి ఎన్నికల ముసుగులో ఆధిపత్యం చేలాయించాలన్న కుట్ర జరుగుతున్నదని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన ఇలాంటి సందర్భంలో ఏచూరి లేకపోవడం భారీ లోటు అని అన్నారు.

వివిధపార్టీల నాయకులు తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, సీపీఎం నేత బీవీ రాఘులు, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఉమ్మడి ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు ఎగ్గొట్టినట్లేనా?

కౌలు రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలి

హెరిటేజ్ కోసమే రైతులకు విజయ డెయిరీ బకాయిలు ఇవ్వటం లేదు: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రుణానికి 'మాఫీ' లేదు.. రైతుకు 'భరోసా' లేదు.. రుణమాఫీ ఒక మాయ, రైతు భరోసా ఒక భ్రమ అని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రూ.2 లక్షల రుణ మాఫీ అయిన ఒక్క రైతును చూపించాలని కాంగ్రెస్ సర్కారుకు సవాల్ విసిరారు. విజయ డెయిరీకి పోసిన పాల బిల్లులు ఇవ్వకపోవటంతో రైతులు పాలను రోడ్లపై పోసి తమ నిరసన తెలియజేస్తున్నారని వెల్లడించారు. శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 10 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.80 వేల కోట్ల అప్పు చేసినా ఏ రంగంలోనూ గణనీయమైన మార్పు రాలేదని విమర్శించారు. మొదట రూ.49 వేల కోట్లు రుణ మాఫీకి అంచనా వేసి, ఆ తర్వాత రూ.41 వేల కోట్లు అని ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. బడ్జెట్‌లో మాత్రం రూ.26 వేల కోట్లే కేటాయించారని, చివరికి రూ.17 వేల కోట్లు మాఫీ చేసి చేతులు దులుపుకున్నారని వివరించారు. వానకాలం పంట పూర్తవుతున్నా.. రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, ఆ నిధులు ఎగ్గొట్టినట్లేనా? అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో రూ.2 లక్షల రుణ మాఫీ, రైతుభరోసా, పంటలబీమా, పసుపు బోర్డు, చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని కాంగ్రెస్ గొప్పలు చెప్పిందని.. ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన వల్ల బీమా కంపెనీలకు లాభం తప్ప రైతులకు ప్రయోజనం ఉండదని ఆనాడే చెప్పామని స్పష్టంచేశారు. తమ ప్రభుత్వంలో పంటలబీమా కోసం నాలుగేండ్లు రూ.2,400 కోట్లు బీమాకంపెనీలకు కడితే రైతులకు తిరిగి రూ.1,800 కోట్లే వచ్చాయని తెలిపారు.

తెలంగాణభవన్‌లో శనివారం మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల

కౌలు రైతులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి

రైతుతో పాటు కౌలు రైతులకూ రైతు భరోసా ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారని, కానీ రైతుభరోసా ఎవరు తీసుకుంటారో రైతు, కౌలురైతు తేల్చుకోవాలని వ్యవసాయ మంత్రి చావు కబురు చల్లగా చెప్పారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. 'తెలంగాణలో కౌలు రైతు విధానం, ఏపీలో కౌలు విధానం వేరు అని అసెంబ్లీలో కేసీఆర్ పలుమార్లు చెప్పారు. తెలంగాణలో పాలుకు ఇచ్చే విధానం, ఏపీలో కౌలుకు ఇచ్చే విధానం ఉంటుందని చెప్పారు. కొందరు ఆంధ్రా నేతల చేతుల్లో ఉన్న రైతుసంఘాలు ఈ వాదన తెచ్చాయి. దాన్ని కాంగ్రెస్ అందుకుని కౌలు రైతులకు రైతుభరోసా అని బురిడీ కొట్టించింది. ఇప్పుడు అసలు విషయం బయటపెట్టి ముసుగు తొలగించింది. కౌలురైతులకు రైతుభరోసా ఇవ్వబోమంటున్న కాంగ్రెస్ సర్కార్ వారికి క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీకి మళ్లించారని ఆరోపించారు.

హెరిటేజ్ కోసమేనా?

రైతులకు విజయ డెయిరీ 3 నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదని, దీంతో రైతన్నలు పాలను రోడ్లపై పోసి నిరసన తెలుపుతున్నారని నిరంజన్‌రెడ్డి అన్నారు. పాల బకాయిలు ఇవ్వకుండా రైతులను హెరిటేజ్ వైపు మళ్లించే కుట్ర జరుగుతున్నదని అనుమానం వ్యక్తంచేశారు. విజయ డెయిరీకి కేసీఆర్ హయాంలో లాభాలు ఎలా వచ్చాయి? ఇప్పుడెలా నష్టాలు వస్తున్నాయి? అని ప్రశ్నించారు. రూ.204 కోట్లతో తెలంగాణలో హెరిటేజ్ పెట్టబడులు పెడుతుందని, నష్టాలు వస్తే ఆ సంస్థ పెట్టుబడి పెడుతుందా? అని నిలదీశారు